ఎక్కడి

✕

కలుషితములైన విషయవాంఛలను రేపి
ప్రజలఁ బశువులఁ గావించుప్రజ్ఞ కాదు
రాగవైరాదులను ద్రోసి రాముదెసకు
నడుపు కౌశలమే కళ నాఁ జెలంగు.

✕

తెనుఁగులెంక

ه

ج

GLRBolA 198

a

ఎక్స్ లిబ్రిస్

Presented to

Sri. V. Lakshmana Reddy. M.A

with the best compliments from

PHONE: 462.

Ln. K. Venkateswarlu,

SECRETARY, LIC[illegible]

Development Officer: LIC of India.

రాష్ట్రసిద్ధికొఱకు రక్తంబు గార్చిన
కవిని నేను గాంధికవిని నేను
బడలిబడలి తల్లి బాస కూడెముసేయు
కవిని నేను దేశికవిని నేను.

తెనుఁగులెంక
తుమ్మల సీతారామమూర్తి

b

సర్వస్వామ్య సంకలితము

మొదటి కూర్పు

ప్రతులు : 1000

1976 జూలై

*

వెల :

రు. 2—50

*

సర్వోదయ ప్రింటర్స్,
తెనాలి.

మొగవాటి

'ఎక్కటి'కి బహువచనము ఎక్కటులు, ఎక్కట్లు. ఎక్కటి యనఁగా అసహాయము, పరాపేక్ష లేనిది, ప్రత్యేక మైనది, రెండవదానితోఁ గలియనిది. ముక్తక మని తాత్పర్యార్థము. ఎట్టినగారి ఎక్కటిగఁ బోల్ప నుపమాన మెందుఁ గలదు' అను ప్రయోగ మిచటఁ జూడఁదగినది.

(హరి. ఉ. 7-164)

ఒక్కఁడు, అసహాయుఁడు మున్నగు మహాదర్థముల యందును 'ఎక్కటి' ప్రయోజ్యమగును. ఎక్కటిబవరము, ఎక్కటొక్కటిపెనఁగిన-మొదలగు తిక్కనార్యప్రయోగము లిచట మూఁదల.

శక్తి యుడిగినను రక్తి సడలమిఁజేసి నాలుగై దేండ్లనుండి అపుడపు డీపద్యములు ప్రవాసితిని. ఇది తగు నని, అది తగ దని కఱదలు పల్కితిని. ఎదుట నున్న సమాజమును సమీక్షించితిని. పెద్దలసూక్తుల నటనట ననుకరించితిని. మొత్తముమీఁద నధికారములేని పనియు కావించితిని. లోకము మన్నించుఁగాక !

సాహ్యయోగము, ప్రసవంతి, ఆంధ్రపత్రిక, ఆంధ్రప్రభ, ఆంధ్రజ్యోతి మున్నగుపత్రికలలో ఈపద్యములు పెక్కింటిని

మొఱసితిని. ఇందులకుఁ దోడ్పడిన ఆయాసంపాదకులకు నా కృతమొఱుక చాటుదును.

తూరుపాఱబట్టుటలో నేఁ డీపద్యములు కొన్ని తోలఁగె. నిల్చిన వీరూపము దాల్చె. ఇవి సహృదయుల నలరించునేని 'ధన్యోస్మి' యనుకొందును.

తెనాలి-సరోదయ ముద్రణశాలా పర్యవేక్షకులు శ్రీ వీరబ్రహ్మముగారు ఈయచ్చుపనిపట్ల ఎక్కటిపరామరిక పాటించి నన్ను మిగులఁ దనిపిరి. ఈయన, నేను సరసం (సరోదయ రచయితల సంఘము) వారము. కాన నాకై శ్రమించుట తమధర్మ మని వీరు తలంచిరి. మంచివారి తలంపు నిట్టివ. ఈదృక్సజ్జనుల నెందఱనో నాపాలి చుట్టములఁ గావించినవారు తెనుఁగువినోబా డాక్టరు వెంపటి సూర్య నారాయణగారు.వీరికిని ఈసందర్భమున నాయభినందనములు.

మఱియు వృద్ధులయ్యు నుదారతాసమృద్ధులగుటఁ జేసి కోరినంతన నాసందియములు తొలఁగించిన వైదుషీమూర్తులు వెంపరాల సూర్యనారాయణశాస్త్రులుగారికి నమ్రతాపూర్వక వందనములు చెలింతు.

తెనుఁగులెంక

తుమ్మల సీతారామమూర్తి



తెనుఁగులెంక

వక్కణము

ఇందలి ప్రయోగములకుఁ గొన్నింటికి వ్యాఖ్యాన ముచిత మని తలంచితి.

6వ పొరటలో 6వ పద్యమున "క్రీవాఁడు" అని కలదు. "క్రిందివాఁడు" అని దీని కర్థము. ఇది క్రీనీడ, క్రీవాడవంటిది. అయినను సర్వనామముతో సమసించుట యిందలి విశేషము.

22వ పొరటలో 2వ పద్యమున "ఎందకో చావు మూడెడిది" అని కలదు. ఈ "చావు" నకు "చచ్చుట" అని యర్థము. ఇది "చచ్చు" ధాతువునకు వచ్చిన భావార్థక కృదంతరూపము. తిక్కనగారి "తాన్పు" వంటిది. ఈకాన్పున కర్థము "కనుట" యనియ. ఉ॥ చిత్తము మెచ్చి ..... తా నత్తటిఁ గ్రొత్తకా న్పగుట నడ్డముసొచ్చెనొ సిగ్గుపెంపు .... విరాట 2-84 (వావిళ్ల) మూ. బా. వ్యా. కృ. 17

30వ పొరటలో 3వ పద్యమున "పంద్రి" కలదు. "మాదిరి" మాద్రి యైనట్లు "పందిరి" పంద్రి యైనది.

43 లో 3వ పద్యమున "కార్మికుఁడు" అనుదానికి "నిర్మాణేయుఁ మార్మికోఽసి నితరామ్" అను పండితరాయల ప్రయోగ మాధారము. కర్మ, మర్మశబ్దములు నకారాంతములే కావున తాచ్ఛీల్యార్థమున "ఇక" ప్రత్యయము చేరి మార్మికుఁడువలె కార్మికుఁడు కావచ్చును. మఱియు

చర్మికుఁడువలె (చర్మన్ + ఇక) కర్మికుఁ డేర్పడి కర్మికుఁడే స్వార్థమునఁ గార్మికుఁడు కావచ్చు నని విద్వన్మణులు సన్నిధానమువారి నిర్ణయము.

63వ పొరటలో 6వ పద్యమున "లేదగున్‌మతి" అను ప్రయోగము కలదు. ఇందలి "లేదు" అస్త్యర్థకమగు "కలుగు" ధాతువునకు వ్యతిరేకార్థకరూపము. దీనిపై స్వార్థమున అగు, ధాతు తద్ధర్మార్థక రూపము "అగును" అన్నది అనుప్రయుక్త మాయెను. ఇంతియకాని "లేదు" అనునది విశేషణము కాదు, అయినను "లేదగును" అనుదానికి "లేనిదగును" అని తాత్పర్యార్థము, చెప్పవచ్చును. ఇచట "చ. అవని యరాజకం బయినయప్పుడ భూప్రజలందు సర్వధర్మ్మములు దొలంగు .... వృష్టి లేదవును ...." అను నన్నయగారి ప్రయోగము (ఆది 4-250 వావిళ్ల) "చ. ధన మది యేల భోగమును దానము లేదగునేని ...." అను తిక్కనగారి ప్రయోగము (శాంతి 8-243 వావిళ్ల) చూడఁదగినవి.

— రచయిత

సవరణ

పేజీ 57 నాల్గవపంక్తి — బ్రజ్ఞ - బ్రజ్ఞ

బహాకృతి


పిన్నపు నీవు ప్రాయమున;
బెద్దను నే; నటులయ్య సర్వదా
న న్నలరించుభావములు
నా నుడికారముతీరుతెన్నులున్
ని న్నలరించుఁ గాన; దన
నికృపుశిష్యుఁడ వైతి వీ; వపి
చ్ఛిన్నముఁ జేతకై జతన
చేసెద నీ రుచిరానుబంధమున్.

కాఁకరపర్తి నిమ్మయకు
గాదిలిబిడ్డఁడ వైన నీకు మా
ధ్వీ కమనీయశీల సము
పేతము జీవిత మబ్బె నద్దిరా ;
నీకవితాప్రియత్వమును
నీసరసత్వము నీ వినీతియున్
నీకృతబుద్ధియున్ దనుపు
నిచ్చలు నామది వేంకటేశ్వరా !

అటుగానన్ బహుమానమై తనర నీ
కస్మత్కృతిన్ దీని "నె
క్కటులన్" మక్కువమై నొసంగెదను
నాకా ; యింతవ్రేఁ గంచు నో
హటిలన్‌బోకుము, తెల్గులెంక కొకలెంకై
వాసిగన్నట్టి నీ
విట జంకం బనియేమి ? సాధుతర
సాహిత్యార్చనప్రీణధీ !

విరివిగ నీకు నే నొఱుగఁ
బెట్టిన దెద్దియు లేదు; కొంటి వీ
చిఱుకీఱుపద్దెముల్ గుణవిశిష్ట
మణుల్ పెలవోసి; గిట్టుపా
టరయఁగ నిందు నాకె వలఁపైనది;
కోమటివైన నేమి; నీ
గురుఁడు గురుండె బేరమునఁగూడఁ
గనుంగొను మీరహస్యమున్.

"చెప్పక వీని కింతపని
చేసితిరా" యనఁబోకు మేను మున్
చెప్పి యొసంగినట్టికృతి
చిన్నది పెద్దది యొండు లేద, నా
చొప్పిది నీకునున్ దెలియుఁజువ్వె !
నలంగినబాట నెవ్విధిన్
దప్పుదు నేఁడు వార్ధకము
తొక్కని దందడివెట్టుచుండఁగన్.



కృతిగ్రహీత

ఎ క్ర ట్లు

ఎవనికరుణ నఖిలభువనంబులకు వెల్గు
పనుచు రవియు శశియుఁ బగలు రేయి
యతనిఁ గొల్తు నతుఁడనై పురుషో త్తము
నాన్య నభవు శుభములావహిం ల్లల.

భావమైనను బలుకైనఁ బలుకులోని
చేవ యైనను జెలువైనఁ దావి యైనఁ
గవికి నీ కృప చేతన కలుగుఁ గాన
నిడెద వాగీశ్వరీ ! నీకు నేటికోళ్లు.

తలఁచెద మదీయ దేశికుఁ జళుకిత్రాఖి
లాంధ్ర లక్ష్మణ జలరాశి ననఘుచరితు
రచితరమణీయ వేంకటరమణశా స్త్రి
నపరచిన్నయసూరి నేకాగ్రమతిని.

తెనుఁగుబాసపెంపు దెలుపఁ దిక్కన చాలు
నన్నమయ్యచాలు హాసు దెలుపఁ
దిన్నఁదనము తీరు దెలుప నేమన చాలుఁ
గేలుమోడ్చు వీరి మేలుములకు.

వస్తు వొకటియైన వర్ణించుకవుల వా
తీరు సారు వేఱువేఱు గాన
నోర్మితోడ వీని నేర్మి పరీక్షింప
నిచ్చగింత్రు సరసు లిద్ధమతులు.

సిద్ధివఱకు నరుఁడు చేయవలయుఁ గాని
మానరాదు నడుమ మంచి పనిని;
అతఁడు నిద్రనైన నాత్మవిశ్వాసంబు
వదలఁడేని గెల్పు వడసితీరు.

కర్తవ్యపరాయణతా
మూర్తిని వారింపలేదు ముదుకతనం, బే
యూర్తియు నంటదు వానికి,
వర్తించు నతండు నిత్యవర్ధిష్ణువుగన్.

వసువు పోవచ్చు మరల రావచ్చుఁ గాని
చన్నకాలంబు తిరిగి రా దెన్నఁటికిని
జనుఁ డిది యెఱిఁగి యొకనిమేషంబునైన
రిత్తపుచ్చక శుభము లార్జింపవలయు.

ఎన్నఁదగిన నడత యేర్పఱుచునందాఁక
జనుఁడు నేర్చుకొన్నచదువు రిత్త;
యెన్నఁదగిననడత యెట్లుండు ? నర్మతా
మందిరముగ సత్య సుందరముగ.

వినయము సత్య మహింసా
ప్రణయము లేనప్పు డెన్ని భాగ్యము లున్నన్
మనుజుఁడు మన్నన లందఁడు
దనుజన కాతం డనుంగుఁదమ్ముఁడు కానన్.

గొప్పతనము హెచ్చుకొలఁది నణంకువ
హెచ్చు నయనియందు; నిది దురాత్మ
నొజ్జనోలె దిద్దు సజ్జను సమ్మతంపు
జ్ఞుల్కరణి సుప్రసన్నఁ జేయు.

పేర్మి తోలఁకాడునుడులతోఁ బేద కిడుట,
యావిగలకల్మి, తాల్మిమై నెసఁగుబీర,
ముద్దతికి దవ్వాదవ్వుల నుండు తెలివి
యరిది యందుము లోకజ్ఞు లైనబుధులు.

ఏను మానవాళి కెల్ల ను శిష్యుండ
నవని నాకు శిష్యుఁ డెవఁడు లేఁడు
నిక్క- మిది యటంచు నిఖిలంబు నేర్చిన
బుధుఁడు పల్క- ప్రజకు బుద్ధిగఱపు.

సాధుచరిత లేని చదువు, పాపభయంబు
లేనిబేర, మీవిలేనిపూజ,
సేవలేనిపదవి శిష్టప్రశంసన
మొందలేపు శాంతి నందనీవు.

పాళ్లలో వాసియున్నను బ్రతిమనుష్యు
నందుఁ గలవు గుణమ్ములు నవగుణములు
నొరులయెొప్పులు తనతప్పు లుగ్గడించు
నతనికే కైవసంబగు నాత్మశక్తి.

చెడ్డవాని నతని చెడ్డతనమునుండి
వింగడించి చూచువెరవు వెరవు
గాంచిపుట్టినట్టి గడ్డయీనేరుపు
లేనినాఁడు వన్నెలేని బీడు.

సత్యమునకు నహింసకు జయము రాక
తప్పు; దొకనాఁడు తప్పెనా తత్ప్రయోక్త
శిక్షకుఁడు గానివాఁ డని చెప్పవలయు
నైపుణము లేనివాఁ డని నమ్మనలయు.

కామరోషాది శత్రువర్గమున కోడి
చేయఁగారాని దోసముల్ చేసిచేసి
యఘములను డాఁచువాఁ డంధుఁ డగును గాని
కనులులేనివాఁ డంధుఁడు కాఁడు కాఁడు.

మఱచి నరుఁడు కొన్నినెరసులు గావింప
వచ్చుఁ గాని వాని వారి నీ
చెవికిఁ దెచ్చునేని సిగ్గిల్లునేని గా
సిల్లుసేని కసటునెల్లఁ బాయు.

తాత చెప్పుఁగాక తండ్రి వాకొనుఁగాక
ప్రగతి కడ్డువచ్చుపలుకు వలదు
నరుఁడు కొయ్య కాఁడు నవనవచేతనల్
పొసఁగ మరలమరలఁ బుట్టు ప్రాణి.

పాపిపల్కఁ ధర్మబద్ధ మయ్యు రవంత
మంతు గనదు కల్లుముత నిడిన
యమృత మెవని కిష్టమగు ? నుడికిన్ దగ్గ
నడత నేర్చినపుడె నరుఁడు గెల్చు.

పొగడి పొగడి రెండు పొడిమెప్పు లందుట
తిరిసితిరిసి యిత్త,తిండి తినుట
యేనికేని చెల్లు; నిది బ్రదుకా ? మాన
భరితమైన బ్రదుకు బ్రదుకు గాని.

విత్త మీాయరాదు విశ్వంబు నలరించు
వృత్త మీాయవలయు బిడ్డ కయ్య;
డయ్యకుండ వచ్చు డబ్బుచే నరునకు
నాము రేఁగు నెల్ల బాము లొదవు.

కదలలేక మూల్గు ముదివానికైనను
వేచియుండు నెప్పు వేయిపనులు
మదిని గుమురుకొన్న మమకారపుంబాడె
యెంపు దనుకఁ దొలఁగ దీ భరంబు.

కంటిచూపు తగెఁ, గాలుసేతులలోని
దిట్టతనము జాఱె, జుట్టు నరసె
నెంతముసలి యైననేమి మానిసి? వాని
యాస జవ్వనంపు టూసు విడదు.

అలమియుండు నెడఁద నజ్ఞత మెండుగా
మోవి నుపనిషత్తు మ్రోఁత లెగయు
నింటిలోనియిరుల గెంటునా మిద్దెపై
నిడినయట్టిదీప మిచ్చువెలుఁగు ?

తొలుత నొకఁ డావగింజంత దోసఁ గొనప్పు
నపల నది నిల్వ సల్పుఁ గొండంత తప్పు
చీము నెత్తురు సచ్చిన చెనఁటి యగుట
జంకఁ డతఁ డెన్ని వెడవెడబొంకులకును.

ధర్మబద్ధమైన దారిఁ జూపెడివారి
బ్రతుకు నోర్వలేరు పరమమూర్ఖు;
లేసుచావు గాంధిమృతి కెన్నడీపోక
చాలు నిచట నితర సాక్ష్యమేల?

సై వానితప్పు లివి యని
క్రీవాఁ డెవి చూపు నవియ కెరలుచు నతఁడే
కావించును దశ మాఱిన
నేవాఁడు కృతాపరాధుఁ డీయిర్వురలోన్?

ఎత్తెగియెండె నొండె నెఱుగక మంటలో
నిడిన కేలు కాల కెట్టులుండు?
పాడినైన నిట్లె పాటింపకున్నచో
రాకమాన దోర్వరాని కీము.

నైతికశక్తిని ధర్మ
ప్రీతిని బేరందుకొన్న పెద్దలు శౌచ
శీతోనఁకెడి సాధిష్ణులు
త్రాతలుగా నున్ననాఁడె తనరును సంస్థల్.

పాపభీతి పోయెఁ బ్రజల కీనాఁడని
వాడ వాడ నఱచువారిలోన
సగముమందియైన సజ్జను లున్నచో
లోకమునకు నింతలోటు రాదు.

మానమ్రద మిగుల మంచిది , నోర్వప్పు
తప్పదేని పరిమిత ప్రసంగ
మనుమతింపవలయు, నాడరా దొకమాట
చాలుచోట నునులు నాలుగైను.

స్రుతిగలియనిసతి నేలుట,
మతిహీనున కొజ్జ యగుట, మత్తునిసేవన్
బ్రతుకుట యనివార్యం బగు
నెతనికి నరకాది యతని కేలా కలుగున్?

ఎవఁడు జనకపాదు లెఱిఁగిన సద్విద్య.
వలచినట్టి సాధువర్తనమ్ము
నభ్యసించి కొల్చు నాతనితండ్రి మే
నూడ్చుఁగాక బ్రదికియున్నయట్లె.

చేవలేనినాఁడు చెడు నహంకారంబు
డబ్బులేనినాఁడు డంబ మడఁగు,
వయసులేనినాఁడు వలతిక్క లోలఁగు, నీ
మాఱుదలకు బుద్ధిమంతుఁ డలరు.

మతినిబట్టి యుండు ధృతి; యెడల్ దీనికిఁ
గారణమ్ము కాదు; కండలున్న
పాఱుఁబోతు లూఁచపడినట్టి దిట్ట లీ
మనుజకోటి నెంతమంది లేరు ?

ఱెఱవానిగుణము లాతఁడు
మరణించినపిదపఁ గాదు మనియున్నపుడే
నరుఁడు కొనియాడవలయును
బరమప్రియ మిట్టిచేత ప్రాజ్ఞావలికిన్.

వనధి వీడి మహికి వచ్చినవాఁకణం
బకట ! యొకట నింకె నది పయోధి
నున్ననాఁడు సైఁచె నుత్తాలనౌక; న
సానవాస మెంతకైనఁ డెచ్చు.

షష్టిపూర్తి యయ్యె నిష్టపూర్తిగను జీ
వితము సాగె ననుట నెట్టిమాట;
ముదిమి నిర్వికారముగ సాగినపుడె 'ధ
న్యోస్మి' యని గృహస్థుఁ డలరవలయు.

షష్టిపూర్తి సభల సందడి దందడి
పెట్టసాగెఁ దెలుఁగు పేఁటలందుఁ
బ్రాయమునకుఁ దోడు బ్రదుకుసకును విల్వ
కట్టవలయుఁ గార్యకర్తలిచట

బ్రదుకుటకై తినవలయును
బదుగురకున్ మేలుగూర్ప బ్రదుకఁగవలయున్;
పెదపెద్దయోగములతో
నొదవనిసుఖమిట్టినడత నొదవు నరునకున్.

చొక్కమైనతలంపుతో నిక్కమైన
మాటతో వినయమ్ముతో మమతతోడ
నొసఁగునుపదేశ మాదల నునుచునెంత
దిట్టమైనను బెడసరకట్టమైన.

పత్రమో పుష్పమో తనపాణి నిడుట
పరమపుణ్యప్రదం బని ప్రజ దలంప
సత్యశౌచాది సుగుణప్రశస్తిఁ డగుచు
నిలుచువాఁడు జగమ్ముల గెలుచువాఁడు.

తల్లిదండ్రులెంతచెల్లనివారైన
వదలరాదు కొడుకు వారిసేవ;
ఉత్తమర్ణుఁడెంతయెప్పనివాఁడైనఁ
దెచ్చుకొన్నయప్పు దీర్పవలయు.

మంచితనమునకున్ దోడు మగఁటిమియును
మగఁటిమికిఁ దోడు సడిసన్నమతియు వలయు
చాలు నీమేలిమెఱుఁగులు చాలు నరుని
పుట్టునునకున్ గృతార్థత పొసఁగు పొంచె.

ధృతిగల పురుషునకున్ మృతి
బ్రతుకున నొకమాఱు వచ్చుఁ బందకు నకటా!
ప్రతి వాసరమ్ము వచ్చును
మతి మంతులు మెచ్చ రిట్టిమానిసి మనికిన్.

శాంతి శాంతి యని నిరంతర మల్లాడు
మానవుండు కుట్ర మాన వలయు
నొరులమేలు గోరి యుచితప్రయత్నముల్
పూనవలయు సమతఁ గానవలయు.

అది చేత యనన్ దగ్గది
యెది జన్మజరాదిదుఃఖహేతువు కాదో !
అది తెల్వి యనన్ దగ్గది
యెది నిశ్శేయసపదంబు నీయంగలదో !

నరునిశక్తి యెంత ? నలుసంత; యీసత్య
మెఱుఁగలేక లోకమెల్ల నాకు
లొంగవలయు ననెడివెంగలి ప్రైవోప
హతుఁడు కాకమానఁ డలనల.

జన్న మనినఁ బసులఁజంపుట కా దహిం
సా పరీతమైన సరణి నొరుల
కుపకరింప నలఁగుయోగము, కష్టించి
తిండిదినెడిహక్కు తెచ్చుకొనుట.

ముదుకబట్ట గట్టి ముగిసెఁ గృత్యం బని
విశ్వసించువాఁడు వెట్టివాఁడు
దీనబాంధవుండ నే నని మనుజుండు
చెప్పుకొనుట కదరు నొప్పుకొనుట.

చెడెదు న న్నంటుచో నని పొడుము నరుని
మొగటనే హెచ్చరించుఁ దుమ్ములను రేఁపి
తగనికుతులెల్ల నిట్టులే తఱుముఁ గాని
యెడఁదబిగి లేనివాఁడు కీడ్పడును వీన.

ఎంతయున్నతి యుండిననేమి మనుజుఁ
డడుగువాఁడఁ డగు నడుగువాఁ డయ్యెనేని
విష్ణునంతటివా డొరు వేఁడఁబోయి
కుఱుచపడె నింకఁ బెఱువారిగొడవ లేల

ఒకఁడు పేద యయ్యు నుఱఁడు భూమీశ్వరు
నొకఁడు తిరియుఁ గల్మి యుండికూడ
గఱువతనము తత్వగతము గాని ధనాది
నాశ్రయించి యుండ దనుట యెప్పు.

వలదు వలదు నాకు వరశుల్క- మనువాని
త్యాగ ముగ్గడింపఁ దగును గాని
క్రిందికులముకన్నె కేలు పట్టినవాని
యీవిముందు దాని కెంతవిలువ ?

పేదవాఁడు కాఁపు బేహారి దళవాయి
ఱేఁడు చక్రవర్తి రేపు మాపు
తన్ను మించువాఁడు తనవర్గమున రామి
కంగవించు నీర్ష్య కంజలించి.

ఇరుగుపొరుగువారి నెడఁదతో నెనరుతోఁ
బలుకరించినంతఁ బండు వగును
లో టదేమి కలదు మాటకు ? సముచిత
సరణిఁ బల్క-వయ్య ! సతము హితము.

బాసపాత్తు చాలునా సౌహృదమునకు
వలయు భావబాంధవమ్ము కూడ
నన్నదమ్ములేకదా కురుపాండవుల్
జగడమాడి రేల జగము నవ్వ.

ఇంట నింట దీపావళి యెసఁగుచుంటఁ
దుంటరి యమాసమసకన తోలఁగెఁ గాని
కోఁతకూలికి వార్చుచుఁ గాములు పేద
యెడఁదఁ గాకొక్కన్నచీఁకటి యెడయుదాయె.

రంగుగుడ్డ ముట్టికిసంగతిఁ జెప్పదు
తెల్లగుడ్డ మాప్పుఁ దెలుపు నప్పుడ
జగము రంగుగుడ్డ కెగఁబడుఁ దువ కహ్హా !
కల్లకరణి నిప్పుగాము నిజము.

చెప్పుగు మంచి వానియెడఁ గడుమంచిగాఁ
బ్రణమించు, మొగులు శరధిఁ గ్రోలు
నప్పు నీరు తీపి నొప్పిదమై నంజ
పుంజ పెనిచి ప్రజకు బువ్వపెట్టు.

నన్ను మఱచినారె నాకున్న దెఱచిన
గురులు మీ రటంచు గొప్పపదవి
నున్నవాఁడు గ్రొక్కు నొజ్జ బెడందల
నెల్ల విస్మరించి యేన్గునెక్కు.

పూర్వసంస్కార మొకకొంత ప్రోదిచేసి
నపుడె మానవుఁ డున్నతి నందనేర్చు
నెందఱు శవంబుఁ జూడ రాయందఱును వి
రాగు లైరె యఖోధరారమణుభంగి.

ఇంటిలోనిపోరు ఋణబాధ ధనవ త్త
పడసినట్టిమెప్పు పడినతిట్టు
మంత్రతంత్రదానమర్మములె పెఱవాని
కెఱుకసేయ నోల రిదమతులు.

పామునకుఁ బాలు వోసినపగిదిఁ గుటిల
చిత్తునెడఁ బూను స్థైరణ చేటుదెచ్చు
నితరు లెట్లుండినన్ బ్రజ నేలువారు
కనుగలిగి యుండవలె నిట్టిఘట్టములను.

మంచిచెడ్డలతీరు గుర్తించు తెలివి
యన్యుఁ డొనరించునెగ్గున కలుగకునికి
యుచితమగు హాస్యవైఖరి యుండునేని
కదలు ననిరుద్ధమై నరుబ్రదుకుబండి.

ఎగసియెగసి తోఁకతెగిన గాలిపటమ్మా
కరణి దారిదప్పి పఱచు వాని
కెవఁడు సెప్పనేర్చు నేకొమ్మకో చిక్కి
స్రుక్కినప్పు డతఁడె చక్క నణఁగు.

నట్టిలు చెడినన్ బొలమున
గొట్టాడదు ముసలియెడ్లు కోల్లలకతనన్
కుట్టిలు చెడినన్ దేశపు
బిట్టాఁగదు తాత లెంత పెనఁగంబడినన్.

నాలుకకు బుద్ధిసెప్పఁగాఁ జాలినట్టి
మనసుతోఁగాక పురుషుండు మందుచేత,
మంత్రమునఁ ద్రోయనేరఁ డామయపిశాచి
నెడ్డతిండికి గారాలబిడ్డ తెగులు.

గుచులు మరగిమరగి రోగాల దాసుల్తై
బెగ్గలించువాఁడు సిగ్గు పడఁగ
నుప్పులేనికూర కుప్పిళ్ళులూకుచు
బాపు వేయిమందిపని యొనర్చె.

ఎన్ని చదువులు నేర్చిననేమి పురుషుఁ
డెన్ని ఘనకార్యము లొనర్పఁగన్న నేమి
సభల రాణింపఁ డొరుతప్పు సైఁపలేక
వెక్కసమ్ముగఁ జిందులుత్రొక్కునేని.

గంట కైదుమార్లు కస్సని బుస్సని
యెగురువానికినుక కేమివిలువ ?
ఆఁగి యూఁగి సాధువావిష్కరించెడి
కాఁకకే జగమ్ము కళవళించు.

వలఁతివారిపట్ల వచ్చునల్క-ను దిగ
మ్రింగునట్టివాని మెచ్చనేల
మెచ్చవలయుఁ దన్ను మించనివారిపై
రేఁగుకిన్క- నిల్వరించువాని.

మంచితన మెసఁగు తావున
నించుకదోసంబు నుండునేమో వలపుల్
నించుగులాబిని ముండ్లు క
ళాంచితుఁ డగు చంద్రునందు నంకమువోలెన్.

మనుగడ నాఁ జనుమేడకుఁ
బుణ్యాదియై దేహమునకు బుద్ధికిఁ బటుతా
జనక మగు బ్రహ్మచర్యం;
బనవద్యత గనుఁడు దీని కౌననికుట్టుల్ !

అన్నియేండ్లు బ్రదికె నంతవయస్సులోఁ
గలన విక్రమించె నిల వడంక
గంగకొమరుఁ డెట్లుగడియించె నీశక్తి
బ్రహ్మచర్యనిష్ఠఁ బండికాక ?

త్యాగమున కెవండు ధారాణ లోకస్థి
వా సహిష్ణుతకు నెవండు రుజువు
తేజమున కెవండు దృష్టాంత మతఁడపో
తెనుఁగువాఁడు నేర్మి కనుఁగువాఁడు.

తెలుఁగువాని కేమి దేశదేశమ్మునఁ
గలదు కీర్తియుగయుగాలనుండి
యైన నోర్వరానియావేశ మొక్కటే
తెరలి తెరలి క్రుంగఁదీయు నితని.

తెలుఁగువాఁ డభ్యసింపదల నుఁట
నీరసంపుబెడఁద నెడయలేఁడు
తేరితేరి యొరునిదెసఁ బేర్మిఁ జూపిరా
పుడమికెల్లఁ బండ్లుపులియు నప్పుడు.

వీలైనపు డందఱు నిల
నేలినవా రగుటఁ దెల్గు లెఱుఁగరు దైన్యం
బాలోచింపఁ బ్రకృతము
చాలింపరు మేర లేని సన్నహానంబుల్.

ఎగుఁబుడిగుఁడుగాక యీవిశ్వమండెల్ల
నొక్కరీతి నడుచు మొక్కవోని
ధర్మ మెదియొ దానిఁ దలఁదాల్చువారు స
ర్వేశ్వరునియెడంద కించువారు.

సకలభూత హృదంతరస్థాయి యగుచు
నీశ్వరుఁడు వెల్గఁగా నన్య లెఱుఁగకుండఁ
దప్పు గావింప నెవ్వానితరము ? తులువ
కొసరికొసరి చంకలుకొట్టుకొనును గాని.

ఒడలు నా నీశ్వరుఁడు నిల్చుగుడి; తదీయ
బాహిరాంతర శౌచసంపత్తిపట్లఁ
గనుగలిగి యుంట మానిసికర్జ; మతఁడు
సముచితాహారమున దాని సాఁకవలయు.

కుంటిగా గ్రుడ్డిగా ఘోరకుష్ఠరోగ
హతుఁడుగాఁ బరమేశ్వరుం డవనిఁ దోఁచు
గుట్టిది యెటొంగి యార్తులకొలువు రాము
సేవగా నమ్మి ధన్యతఁజెందు నరుఁడు.

తలమోఁదివెండ్రుకలు తిరు
మలనాథునికిచ్చినంతమాత్రన పొంగా
తలలోనిపొగరు పొచ్చెము
బలిగా నిడవోయి ! బాగుపడఁగా వెడఁగా !

పద్య మల్లుఁగాక పాడుఁగాక ప్రభుత్వ
మూనుఁగాక వీథు లూడ్చుఁగాక
మనుజుఁ డెల్ల కృత్యమును హరిసేవఁగాఁ
దలఁచునేని ధన్యతను గడించు.

నరునిజీవితంబు విరిసెజ్జ కాదు గం
గా తరంగడోలికయును గాదు
కలఁడు దీని నొక్కఁకంటఁ గనుంగొను
గూఢచారి; మఱవఁగూడ దతని.

నీటి నలలఁబోలె నిఖిలజీవులఁ దన
యందుఁ జూడఁగన్న యాలఘుమతికి
నెవఁ డరాతి మిత్రుఁ డెవఁ డతఁ డఖిలమ్ము
మానసించు బ్రహ్మమయ మటంచు.

ఇంతి యెదురువచ్చినంతన యూహాదల
వంచి తొలఁగఁబాఱువాఁడు నరుఁడు
నవల తన్నుఁ గడచినను మోర వై కెత్తి
మలఁగి చూచువాఁడు మకురుదున్న.

వారిని వీరి నణంచుట
కారాటంపడక యింద్రియమ్ముల గెలువన్
గోరవలె నరుఁడు, లోకం
బారా ! యనఁ దగినవిజయ మది నాఁ జెల్లున్.

ఇంద్రియమ్ముల కాదేశ మిచ్చి నట్టి
బ్రబుకతో మానవత్వంబు పడసినట్లు;
మనుజుఁ డంతకుమున్ను తా మన్నబ్రతుకు
మబ్బచిపోనచ్చు; నది యొక మడ్డిబ్రతుకు.

ఛత్రపతిశివాజీకీర్తి ధాత్రికెల్ల
వెల్లయిడైఁ గాని పరసతీవిముఖమైన
నలపుచే నందు ముక్కాలు వడసె నతఁడు
తీవ్రతరతప మేకపత్నీకనిష్ఠ.

పెద్దవారిబుద్ధి పెడవోయి యీనేల
నాల్గుమక్క లయ్యె నరసమాజ
మెవఁడు దీని మరల నేకముచేయునో
చేయరున్నఁ గడిఁదిచెట్ట పుట్టు.

మనుజు నొక్కని దేవతామాళిఁ జేసి
యొకని నస్పృశ్యతాదోష నికృతుఁ జేసి
నారి నవమానభారావనతను జేసి
దారిదప్పెను హిందూమతప్రవక్త.

ప్రాఁతలైనఁ దాల్చి పసలేనికూడైన
మెసవి నేలనైన మేనుమోపి
ప్రాణికోటికెల్ల బంధువై సమత్వమ్మెఁ
బరఁగు నెవ్వఁడతఁడె బ్రాహ్మణుండు.

అతిథిసేవఁ దగిలి యధ్యాత్మవిద్యలోఁ
బండి యార్జవమ్ము పడసి నిష్ప
రిగ్రహమ్ము నవధరించి తపస్వియై
పరఁగు నెవ్వఁడతఁడె బ్రాహ్మణుండు.

ఎఱుక పండినంత నేగు నహంత స
మత్వవృష్టి యొదవు మానవునకు
శంకరుండు మున్ను చండాలునిన్ ద్విజు
నొక్కరీతిఁ జూచె నిక్కతాన.

సత్యదర్శనమ్ము సమకూడినంత రా
మానుజుండు గోపురాన నిల్చి
కులమతాదిభేదములఁ ద్రోసి తిరుమంత్ర
ముచ్చరించె నింగి యుదరఁ బ్రజకు.

వీసుకథలెల్ల మన కేల దోసిగాని
తన్ను దయసూలి చిత్రవధంబొనర్చు
నజ్ఞలను సైఁపు మోతండ్రి! యన్నసుద్ది
చాలుఁజాలు సహస్రయుగాల వటకు.

దైవభక్తి కతఁడు తారాకణ, నమ్రతా
మూర్తి యతఁడు; సంతతార్తసేవఁ
దనివిసెందు నతఁడు, దంభమ్మునకు నతఁ
డాసపడఁ డహహో! మహమ్మ దతఁడె.

సాంస్కృతిక పారతంత్ర్యమ్ము సైఁపరాని
కీడు నిము జాతి; కిది రాజకీయమైన
బానిసముకంటెఁ జెడు; గని దీనిఁ ద్రోయ
నడుముగట్టినయతి దయానందసుకృతి.

మతములను బేరుకొన్నట్టి మైల నుదికి
బ్రబుకు పండించుకొనె వేమపండితుండు
వెఱి పెఱుఁగని సాహితీపీరుఁ డితఁడు
విమతులయెడందలకు బొఁకు వీనివాకు.

కల్ల తగ దాస్తి నార్జింపఁగాదు వర్ణ
భేద మనుచిత మెడఁబాయరాదు కృపను
జడమునకు నాత్మ కల దని చాటి వర్ధి
మానుఁ డారాధ్యుఁడై జైనమతము నిల్పె.

వెతకు నిల్లు జగము, వెతకున్ గతము కోర్కి,
కోర్కి సమసినపుడు కూలు వెతయు;
మంచిచూపు తెలివి మాట మున్నగునవి
మణఁచుఁ గోర్కి నసియె మారజిత్తు.

బుద్ధుఁ డీభారతమ్మునఁ బుట్టఁడేని
మేఁకలాపులమందలు గాక నరులు
నెందఱో చావు మూఁడెడి దింద్రలోక
సుఖము నర్థించువెడఁగుల సురియచేత.

మొఱకునమ్మకములకుఁ గైమోడ్పు లిచ్చి
తడిపి రీనేలఁ బ్రజలర క్తమ్ములోడ
నడిపి రొయ్యన వెన్కకు నరునిఁపంపు
చెఱిపి రనవద్యమైన సంస్కృతిని జడులు.

ఎడఁద నీశుఁ బ్రతిష్ఠించి మృత్యువునకు
నాసనముచేసి మూఢవిశ్వాస వికృత
దేశమును వేయిచేతుల దిద్దినట్టి
కందుకూరిని గొరయువా రెంద ఱుంద్రు ?

ఏమతమ్మునఁ దోఁచిననేమి నిత్య
సత్యమున్ దలఁ దాల్చును సజ్జనుండు
నామతంబె సేవ్యం బనునరుఁడు తెలివి
పండని యహంతయొండని పండితుండు.

కరుణ కంకితమ్ముగాని సూన్యతమున
కగ్గపడని ప్రేమ నాస్థలేని
మతము లేదు కాని మనుజుఁ డహంకృతిన్
ద్రోయలేక ధర్మమూరుఁ డయ్యె.

మతము లెన్నియున్న మానవతతియెల్ల
నొక్క-జాతి యనుట నిక్క మగుటఁ
బొరపు లుజ్జగించి నరు లితరేతర
శ్రీ సహించి లగ్గుఁ జెందవలయు.

మతము మార్చుకొనియె మాధవరా వేసు
నాశ్రయించె ధామ సయ్యెఁ గాని
కూఁతు పెండ్లినాఁడు కులమునకే లొంగెఁ
ద్రోయరానిదయ్య మాయెఁ గులము.

ఒకదారమునం గల మా
క్తికములవలె మతము లెనసి దేశమునకు నొ
ద్దిక నేర్పవలయు విశ్వము
సకలము హరిమయ మటుంచుఁ జాటఁగవలయున్.

తెలుఁగుకవుల కాదృతి నొసంగి తెలుఁగురా
మయ్యవైభవంబు నాసచేసి
తతయశమ్ము గన్న తాన్షామతం బేది?
ప్రేమమతమె శాంతిధామమతమె.

కొందఱి కిచట్టన్ గోవెల,
కొందఱకు మసీదు, చర్చి కొందఱ కున్నన్
సుందర భారతదేశం
బందఱకున్ గుడి యగున్ మహాత్రీర మగున్.

రేపటికి మేఁత యెట్లనుచూపు లేని
దగుటచే నాటపాటల నలరుఁ బులుఁగు;
ముందువచ్చు మూఁఢుతరాల మందిబ్రతుకు
లరయుఁ గాన సదా వ్యథ నందు నరుఁడు.

కలిమి గూర్పవచ్చుఁ గాని దానికి నరుఁ
డంధదాసుఁ డగుట యనుచితంబు
మేరమీఱినట్టి కోరిక లిహపర
శ్రేయములను జెఱుచు దాయ లగుచు.

అక్కఱలేని ధనాదులు
పిక్కటిల్లి పగలు రేయి పెనఁగెడి లుబ్ధుం
డిక్కడ నక్కడఁ జెల్లఁడు
కుక్కలుఁ బడ వానరుండు కుడుచునవస్థల్.

ఒక్కచోట నునికి యొప్పదు సంపత్తి
కదలవలయు గడపగడపదెసకుఁ
గదలదేని క్రుళ్లి కంపెత్తి కూలారుఁ
గానవలయు సాహు లీనిజంబు.

చపల యంత్రు లక్ష్మి నపనిందగా కిది
నిక్క- మగునె యెవఁడు నీచసుఖము
లాసచేసి రూక వీసముగాఁ జూచు
నతని సిరి త్యజించు నది దొసంగె?

తాతకూర్చిన సిరివిల్వ తండ్రి కొంత
యెఱుఁగు నెఱుఁగఁడు మనుమఁ డొక్కింతయైనఁ
గాన మూఁడవతరములోఁ గలిమి నిల్వ
దనిరి పెద్దలు లోకంబు నరసియరసి.

వ్రాయనలయు లెక్క- వచ్చిన పోయిన
రూకకును సదా పరాకులేక
పాపపుణ్యములను బ్రకటించు నది యభ
మర్ణ తావిపత్తి మాన్పనేర్చు.

ఉత్తమస్థ ముంచునె త్తేమి యని సందు
లరయువారిసంఖ్య పెరిఁగెఁ గాన
నప్ప లేనివాని హర్ష ముకంటె నేఁ
డప్పులీనివాని హర్ష మెచ్చు.

పాడిదప్పి నరుఁడు పడసినసిరి కొంత
గుడికి బడి కొసంగఁ జెడదు కలుచ;
సెలగగొంతు గోసి చెప్పులదాన మొ
నర్చినంతఁ మూలునా యఘమ్ము.

నిక్కమైనయీవి నేర్చినపురుషుండు
పేదవాని నరసి పిలిచి యిచ్చు
నతనికరుణ కవధి యన్నది లేదు రే
పనెడుచింత వొడమ దతనిమదిని.

ఈవి బట్టబయలు కావలెనా యది
యెంతగుప్త మైన నంతమేలు
సర్వసాక్షియైన జగదీశ్వరుఁడు దాని
నెఱుఁగఁగలఁడు దాత నేలఁ గలఁడు.

మధురభాషణంబు మక్కువ దయ పాత్రు
నెఱుఁగునేర్పు గర్వ మింత లేమి
వలయు దాత; కిట్టివాఁ డర్థి నూరక
పంపుఁగాక దూఱుపడఁడు చెడఁడు.

చెట్టు పుట్టి పెరిఁగి చిన్నారి పొన్నారి
పూలు పూచి కాచి మేలిరుచుల
పండ్లనిచ్చి యెండి పద డగుఁ బ్రొయ్యిలో
నెంతయీవి నేర్చె నిది బలారె !

రవిని శశిని జూచి రత్నాకరుని జూచి
గాలిఁ జూచి మేఘమాలఁ జూచి
తరువుఁ జూచి నదిని ధాత్రిని జూచి ప
రోపకృతికి మనుజుఁ డొగ్గవలయ.

పసిఁడి మెండుకొన్నపాఁతఱి లున్నను
ప్రేమలేనివాఁడు పేదవాఁడె
రువ్వకాదు గ్రుడ్డిగవ్వ లేకుండిన
నార్తఁజూచి కరఁగునతఁడు ధనియె.

దారపుత్రపరిధి దాఁటి యూరికిఁగొల్లి
వియఁబొఱవలయు నగునిప్రేమ
యింతమాత్ర నాఁగ కిది మండలాదులఁ
గడచి జగతికెల్లఁ గ్రమ్మవలయు.

కూలి కొరులగొంతు కోయుబెట్టిదుఁడైన
బిడ్డ నెత్తి ముద్దుపెట్టుకొనును
ప్రేమ విడువరానిపెన్నిధి, యానంద
మనఁగ నదియె దైవ మనఁగ నదియె.

ప్రేమ లేనివాఁడు పెట్టులడ్డునకంపెఁ
దృప్తి నొసఁగు నాప్తుఁ డిచ్చు రొట్టె
శౌరి సంధికేగి రారాజువిందును
ద్రోసి విదురుగంజి కాసపడఁడె!

కల్ల కవుడు లేని గర్వగంధము లేని
పసుసందవము లేని బ్రదుకు నిచ్చి
కరుణ నోర్మి నిచ్చి నరు నీశ్వరు నొనర్చు
ప్రేమ కుద్దిసేయ నేమి కలదు ?

ఎడఁద నెపు డూఁచమఁట్టుగ
నడఁగును గామంబు నరున కపుడు రిపుఁడు
కృడఁ డొక్కఁండును మహి నె
య్యెడ కేగిన హార్ద మతని కెమురై తనుపున్.

చేఁతలు విడి వనికిం జను
నాతఁడు మోక్షమ్ము వడయు ననుటొప్పునె యీ
నీతి యథార్థం బగుచో
జాతికి అప్పకును ముక్తి రావలయుఁగదా!

వలయు సాంఘికసేవ కావలయు నాత్మ
చింతనము పురుషార్థ మాసించువాని
కివి పరస్పరప్రాణము లిందు నెదియు
గణ్యత గడింపఁజాల దెక్కటిగ నున్న.

జగతినున్నకల్మి సకల మీశ్వరునిదే!
యెసఁగు సంఘమూర్తి నీశ్వరుండు,
మనుజుఁ డితనిసొత్తు దినుటతప్పదు, ఋణం
బిది సమాజసేవనే తొలంగు.

త్రోవలోనిముండ్లు తొలఁగించినం జాలు
గొప్పగొప్పసేవ లొప్పకున్న
నిస్సిరో! సమాజహితమునఁ దనహితం
బిమిడియుంట కానఁడేమి జడుఁడు.

పదుగురకు మేలు చేకూర్చుపని కుదారుఁ
డట్టి సమకట్టుఁ దన కెంతచెట్టు యైనఁ
గడలిఁ బుట్టి సెగల్‌పొగల్ క్రక్కు-విసము
నీశ్వరుఁడు క్రిందఁడే లోకహితము వలచి.

వెతలు కొఱంత లెన్ని వెంపరలాడినఁ
దోడివారు తన్ను వీడి చనినఁ
బిటికి గాక ప్రజల మఱవక సేవించు
నరుఁడు ధన్యజీవి నాఁ జెలంగు.

తనసుఖమ్ముకొఱకుఁ దరలింపక పరార్థ
హేతువైన పనికి నింద్రియముల
నెవఁడు పనుచు నతఁడు కృతబుద్ధి, సంయమ
మూర్తి యతఁడు, విగళితార్తి యతఁడు.

ఎన్ని చదురు లెఱింగిన నేమి మర్త్యఁ
డొడలు వీడుట యనివార్య మొకదినాన
నిట్టితను వార్తసేవలో నెడయుకంటె
నెన్నఁదగినట్టి చేఁత వేఱెద్ది కలదు.

సంతుఁ గనుచును బెంచుచు సంఘమునకు
సేవచేయుట పొసఁగనిచేఁత యనుచు
నలువ దేండ్లు నిండనినాఁడె నగుచు బ్రహ్మ
చర్య మూనిన యమి నెంతు జాతిపితను.

రమ్మ రమ్మ స్వతంత్రభారతము నేల
రమ్మ బాపుజీ ! యని మహారథులు వేఁడ
వలదు వల దని దుఃఖితావన చికీర్ష
నౌఖలికిఁ జిన్నగాంధి కేనరుఁడు జోడు.

పసుల నొంప నూఱుగురుదొరల్ సచ్చిన
చావుకంటె నొరుల సౌఖ్యపెట్టు
నొకమహాత్మునిఁ డసువు లూడ్చుట యెనలేని
విలువ నందు విశ్వవీథులందు.

విందువేళ వేవు రుందురు చుట్టాలు
బొందువేళ నేవు రుందురేమొ
తెలుఁగువారి పెండ్లి లేఱఁ గిడి దీనికై
కవిత లేల పంక్తిగడలకొఱక ?

తెల్ల వెంక్రుక నొకనాఁడు తీసివైచె
నల్ల వెంక్రుక నొకప్రొద్దు దుల్లఁజేసె
మీసములవాసికే యింతచేసె నతఁడు
వయసు నేర్పెడిపాఠముల్ వదలలేక.

దిగినచానసొగసు తిలకించుచుండఁగా
బస్సు బుయ్యి మనుచుఁ బరుగులెత్తెఁ
దెల్ల మొగమువై చెఁ దెరువరి వాయిదా
నేఁ డటంచు జడ్జి నిప్పటంచు.

బస్సులో నొక్కఁడును లేఁడు బాటసారి
యెక్కఁ జూచెడు తెరువరు లేవు రార్వ్వా
రైననేమి రారాపిల్లు మానలేక
చించుకొన్నారు చొక్కాలు చెనఁటు లగుట.

వాఁడు ప్రొద్దుకు కుశలవార్తలకున్ దిగె
వీఁడు మిమ్ము మఱచినాఁడ ననియె
నతఁడు మీమమఱందియత్త మా పొరుగూరి
పెద్దకాఁపుగారిబిడ్డ యనియె.

చేతఁగానివాని కోఁతల కొక యంతు
కానరాదు కస్తి లేనినాఁడు
బెట్టిదంపు వెతలు చుట్టినతఱి వాఁడు
పరుగుదీయు నఱవపప్పువోలె.

అజ్ఞ్ఞఁ డలసిసొలసి యరగంట ముందు రా
జాము తడసి వచ్చు సభకు విజ్ఞ్ఞఁ
డవల గంట గడవ నధ్యక్షుఁ డేతెంచు
సాగు నిట్లు నేఁటి సమయనిష్ఠ.

తెల్లవాఁడు పోయె దేశంబునకు నిఁక
నవత వచ్చు నని జనమ్ము పొంగ
నదియ వచ్చెఁగాని యరసున్నతో వచ్చి
కన్నకలల నిండుసున్నచేసె.

క్రిందినుండి మీఁదికిన్ గొల్లగొట్టుకే
పాటి యయ్యేఁ బొరుపత్తె మొదవ
మంచివాఁడు వందమందిలో నొకఁ డున్న
నెంతలగు వొడము నితనికతన.

కట్టినమఱునాఁడే మన
కట్టడములు కొన్ని కూలెఁ గాలువలోనన్
దట్టుఁడుమ న్నెత్తింపని
దిట్టలకున్ బిల్లు ముట్టి దిగఁబడకుండన్.

కొంచెపను లెన్ని చేసిన
లంచము రప్పించుఁ దుల్వాలను నేఁ డకటా!
క్రించులముంగడ నౌదల
వంచిరి సజ్జనులు డిల్లవడి రెల్లెడలన్.

చిల్లిగవ్వలేని సిరిమీఁద రుచిలేని
మనుజుఁ డెక్కవలయు మంత్రిపీఠ,
మతఁడు తోఁటకూరమెతుకుతో బ్రతికెనా
ప్రజయుఁ గన్నవిచ్చుఁ బ్రగతి వచ్చు.

త్యాగమునకుఁ గాక భోగంబునకు బరా
బరులు సెప్ప నిష్టపడరు జనులు
మున్ను బుద్ధు వెంట నిన్న బాపూ వెంట
నేల పరువులెత్తె నీజగత్తు?

మంత్రిగా మంత్రిమాళిగా మన్న శాస్త్రి
యస్తమించినతఱి నాలిపుస్తె తక్క-
నన్య మొకరువ్వ లేదట్టి యతని కాస్తి
బాపునకుఁ దగ్గశిష్యుఁ డీ బహాద రదిర!

తూఁట్లు కుట్లుఁ లేనిదుస్తులు కఱవౌట
సచివుఁ డయ్యు రాచసొరుగుల్కు-
విందుదెసకు శాస్త్రి వెడలఁడు లోకాన
కొంతసేతి నేర్పె నీతపస్వి !

అడుగ రేమి నన్ను నధికృతుల్ రాబడి
పన్నటంచుఁ దాన పద్దులరసి
పంపె నర్థి మేలుబడివారి కల 'టాండ'
నెంతధర్మదీక్ష నితఁడు స్థైఁచె !

నీకుఁ జెట్టునీడ నాకు బంగరుమేడ
నీకుగోఁచిపాఁత నాకువలువ
నీకుఁ గటికిపస్తు నాకువిం దనుదొర
యెన్నినాళ్లు ప్రజల నేలఁగలఁడు ?

తక్కెఁడవలె నల్పుని బై
కెక్కించి గరిష్ఠుఁ గ్రింది కీడ్చెడిదొర లే.
దిక్కునఁ జూచినఁ గల రీ
తక్కెఁడిపని దురభిమానదాసుల కించున్.

కత్తితోడఁ గాదు కరుణతోఁ బ్రేమతోఁ
బ్రజల నేలవలయుఁ బొర్థివుండు
నేవకొఅకుఁగాని కావరమునఁ బ్రుళ్ళి
పడుటకొఅకుఁ గాదు ప్రాభవంబు.

వంకలేనిబ్రదుకు వలచువానికి నైన
బొంకకున్న నేఁడు బువ్వలేదు
ప్రజలమేలు కోరి పరిపాలనముసేయు
దొరలు దీనిహేతు వరయవలయు.

సత్యమునకు ధర్మవునకు
నత్యయ మేనేలఁ బొడమ దానేలను దా
ర్గత్యము లెవ్వియుఁ బుట్టవు
నిత్యము దైనంబు దానినెఱి నాదుకొనున్.

ఎన్నియనలాస్త్రములు సృజియించుకొన్న
నెన్నిరాజ్యాలతో మైత్రి పన్నుకొన్న
నిక్కమగు శాంతి పడయఁ డేనేతయైన
మిట్టిపడుదురాశల నరికట్టకున్న.

అంతభాగ్య మున్న నమెరికాదొరలు ని
ద్రింపలేరు. మాత్ర మ్రింగకున్న
నీయశాంతి కెద్ది హేతువు? జగమెల్ల
నేలవలయు నన్నతృష్ణ కాక.

నపులయంద కాము సురలయం దే నధి
కారకాంక్ష కంతు కానరాదు
హానినిగొల్చు నింద్రుఁ డచ్చరలను బెంచుఁ
బదవి నిలువ నెల్ల బదవ లోర్చు.

ఏవిప్లవమున కైనను
జీవ మహింసావ్రతంబె చిరతర మగు నీ
త్రోవం బడసినవిజయము
రా విందు విజేతపట్ల రవరవ లెపుడున్.

సర్వోదయమార్గమ్మున
నుర్వీకిఁ దేవలయు శాంతి; నొండొక బాటన్
బర్వీడి సాధించిన నది
నిర్వఘ్నం బగుచు నిలువ నేరదు నిచ్చల్.

పమగురలో నార్వ్వారకున్
ముద మిఁకరాజ్యమ్ము కాదు మొత్తముప్రజ కిం
పొదవించు ప్రభుత కావలె
నిదె సర్వోదయవిధాన మిదె కామ్య మగున్

విధులు నెఱవేర్చువానికి
నధికారము లావహిల్లు నలవోకఁ; గతో
ర ధరిత్రి దున్ని నానా
వ్యధ లోర్చుకృషీవలునకు నబ్బవె పంటల్.

దేశమునకున్ స్వతంత్రత
యాశాస్యమ కాని సాయమాంచిత చరిత
ప్రాశస్త్యంబును వలయును
నాశిలు నీశక్తి లేనినా డుద్ధవిడిన్.

నాకు దక్కదేని నాకోవ నెవనికి
దక్కరాదు గొప్పతన మటంచు
నీసు పెంచుకొన్నమాసికిఁ బెఱివాని
పాదుకలను దుడుచుపాళ్లె దక్కు.

పంచవర్ష ప్రణాళికల్ పది పదాఱు
నడచినను మనదేశ మున్నతికి రాదు
కండగలవార లందఱు కయ్యకేగి
హాలము పట్టిననాఁడె నా డందు గెలుపు.

సామ్యవాదమో ప్రజాస్వామ్యమో నియం
తృత్వమో మ ఱేప్రభుత్వమేని
కూడు గుడ్డలేని గూఁడులేని బికారి
మెప్పు లందవలయు ముప్పు లణఁచి.

హరిజనులకు గిరిజనులకు
నురవగుమే లాచరించి యుద్ధిప్తి నిడన్
దొరఁకొనె దొరతన; మదిగో !
భరతోర్వీన్ నవయుగ ప్రభాతము తోఁచెన్.

బాపుజీ కన్నకలలు దబ్బఱలు గావు
పుణ్యమూర్తులతలఁపులు పొల్లువడవు
సమతకున్ నెఱిగద్దియై జగతికెల్ల
హితము సెప్పకపోదు భారతధరిత్రి.

చట్టమును బట్టి సిరి తగ్గునట్టివారు
దాతలవిధానఁ దనియుట తగినచేత
కలిమిఁ బడయుపేదలు కృతజ్ఞతను జాటు
టుచితవిధి; యుర్వి కిడె శాంతి నొసఁగు సతము.

ఒకఁడు పునాస నసా దనె
నొకఁ డొనరెఁ బైరపంట నొండొండ భయా
నకరణ మేర్పడె నిర్వార;
కకృత్యములు సాగు నిట్టు లజ్ఞులనడుమన్.

పనికిమాలినవాఁగుడు పట్టులేని
తర్కమును సందడించు రథ్యలను నేఁడు
పల్లవగ్రాహి పాండితీప్రౌఢు లెగసి
వచ్చె నీవావదూకతా వైభవంబు.

తూర్పును బడమర యనుటే
నేర్పని భావించువారు నిండిరి మహి; వీ
రేర్పఱుచు సమాజమునకు
నార్పులు పెడబొబ్బలేకదా నిత్యవిధుల్.

శక్తుఁ డైనవా డశక్తుల హింసించి
కుట్రగాఁ డమాయికులను ముంచి
నిక్కి-పఱుట తక్క- నేఁటిసమాజమం
దెన్నఁదగినమేల్మి యేమికలదు?

బడుగువారిఁ జెండి పడవైచి మోసముల్
దీఁటువారిపొంగు తిరము గాదు
వారితోడ వారె పోరి కొన్నాళ్ళకుఁ
బోలియఁగలరు యాదవులవిధాన.

పల్లెపట్లు శాంతికిల్లని యొకనాఁడు
చెప్పుకొంటి మిపుడు నిప్పులేక
మండఁదొడఁగె నూరు మదమత్సరక్రోధ
నిలయ మగుచు విలయవలయ మగుచు.

మగవార లెంతచెడినను
మగువలు రక్షించుచుంద్రు మనధర్మంబున్
జగ మెఱిఁగినసత్యం బిది
మిగులన్ గొనియాడఁదగినమే లిది ప్రజకున్.

సాధుతకు నాశ్రయం బాత్మశక్తి కిరవు
కరుణకున్ ప్రేమమునకును గాణయాచి
కన్నవారలకే కాదు కస్తి నున్న
ప్రాణులకునెల్లఁ దల్లిగాఁ బరఁగు మగువ.

అనుకూలశీల యగుసతి
తన కబ్బిననాఁడె గేస్తు ధన్యతనందున్
మును కూర్చుకొన్న పుణ్యము
వనితారూపమున వచ్చి వరు నలరించున్.

ఎడఁద విప్పి మగఁడు వెడలించుమెప్పున
కతివ తనియుఁ గాని యతఁ డొసంగు
తొడవులకును సొగసు తొలఁకాడుసరిగంచు
వలువలకును దృష్టి వడదు వడదు.

అతఁడు సార్వభౌముఁ డగుఁగాక విద్వాంసుఁ
డగునుగాక యోధ యగునుగాక
వెలఁదినెయ్యమునకు వెలియయ్యెనా వాని
బ్రతుకు మోయరానిభార మగును.

మగనికన్ను కన్నె మొగముమీఁదికి దూఁక
బాలచూపు విభునిపదము పట్టు
నెంతనేర్చె వినయ మీగడ్డ నొదవిన
యాఁడుబిడ్డ పరిణయంపువేళ.

అతిమృదులం బతికర్కశ
మతిసుఖ మతికష్టమై మహాద్భుత మగు సం
గతికద పాణిగ్రహణము;
కృతమతులగు నాలుమగలు గెల్తురు దీనన్.

వలపు ధర్మ్మవు కూడి వివాహరూప
మందుకొనె భారతీయగేహమ్మునందు
ధర్మ్మమున కవిరుద్ధమై తనరువలపు
నాదరించుట వాదర నడుగునిడుట.

కాఁడికలియవలయుఁ గడుపుపంటకు మన
పొలముపంట క్కింతవెలితిలేక
కలియదేని బండి తలక్రిందులై కూలు
నడలుచెంచు డింను నప్పుడు కాఁపు.

బువ్వలేనినాఁడు భుజబల ముండదు
తిండిలేనినాఁడు తెలివి సున్న
మెతుకులేనినాఁడు బ్రతుకే హుళిక్కిరా!
కూడు వలయుఁ బ్రాణిగొడవ లడఁగ.

కరుణగల ధనధాన్యముల్‌గల గృహస్థు
లెవ్వరో కనలేక యింటింటి కేగి
జోగి యపరాహ్ణమైనను జోలె నిండ
కలమటించెడి నీగడ్డ నహారహంబు.

వచ్చునర్థి కెల్ల బిచ్చంబు నిడలేక
పొమ్మునపొ మ్మనంగ బుద్ధి రాక
నలఁగుచుండె నేఁడు నాదారుసంసారి
కలఁగుచుండె బిచ్చగానితిట్లు.

నేటికి ననుగ్రహించి నామాట నమ్మి
కేపు రమ్మని కొంకుచున్ గాఁపు నుఁచువ
నమ్మపెట్టునులే యని యర్థి గెల్చు
వీనుమిగిలె మనస్తత్వ విద్య నితఁడు.

పసిచూపెదఁ జేద కతం
డొనరించినఁ దండి నిడెద నొండైన నిడన్
తనువు నలంపని వానికిఁ
దినుచన వుండ దని గాంధి తెగఁబడిచెప్పెన్

దొరయైనను బంటైనను
బరిశ్రమమొసర్చి తినుట పాడి; నరుం డీ
తెఱఁ గొప్పిన భువి దివిగా
పఱిలు ననెన్ గాంధి ధర్మపత్నులుఁ డగుచున్.

అన్నసత్రాలు మనజాతి నధమగతికిఁ
దెచ్చె, నలసత డంబము హెచ్చె వీన
నాకు నధికారమున్న నేనాఁడొవీని
మూసియుందు ననెన్ దయామూర్తి గాంధి.

శక్తి యుండియుఁ జెమరోడ్చు రక్తి లేని
నరునకున్ జాలిచూపదు నాయహింస;
పేదమెడ నున్న నెయ్యమే నాదుమదిని
తాతిఁగాఁ జేసెని ట్లన నె జాతిగురుఁడు.

కాలు చేయి లేక గాసిల్లుబీదకు
వుసలితనపుబరువు మోయుననద
కేలువారు తిండినిడుట కృత్యం బని
వక్కణించె గాంధి నిక్కువరసి.

పండి కైవ్రాలె బంగారుపంట యనుచు
కైతు మది నుబ్బెనో లేదో రీతిదప్పి
కురిసెఁ గుత్తుకబంటిగాఁ గుంభవృష్టి
కనఁడు దొర వేయిగండాల కాఁపుబ్రదుకు.

మన్నిళ్లకుఁ జన్నిళ్లుగ
మన్నపుడే సేద్యగాఁడు మన్నన వడయున్
మన్నీఁడ నేను నా కేవఁ
డున్నాఁ డేదు రన్నపూఁట నోటమికుడుచున్.

మితిమీఱిన వెచ్చముతో
శతుకులబొంతగ నిరంతరార్తికరముగా
మతిలేని కాఁపుబిడ్డల
బ్రతుకు కనంబడి నేఁడు పరిహాస్యముగన్.

ఇడ్డెనలు దోసె లటుసెలు
లడ్డులు తెగమెక్కి మెయి నలంపనికాఁపా!
గడ్డిదిని బండి నీడ్చెడి
గొడ్డా! తగుజంతు వేద్ది కొనియాట కిటన్.

కమ్మతంపుబడుపు కార్మికుతల మోపి
చెలువుగుల్కఁ బుడమిగువలువ లూని
రచ్చబండి కెక్కి రగడలు సాగించు
కాఁపు బొగుపడుట కల్లకల్ల.

ఒకట రెంటఁ గాదు సకలదురభ్యాస
ములఁ నపేక్షచూపు హాలికుఁ డిపుడు
చిన్నచిన్నపదవి కెన్నియుద్ధము లైనఁ
జేయ నోర్చు నొరు లిసీ! యనంగ.

శ్రమసరే! కార్మికుఁడును
ప్రాతఃకాలమున నాల్గుసావులు కాఫీ
దాత కిడు, నింత నాఁగక
నీతివిరుద్ధవ్యయంబు నేర్చెను మిగులన్.

మిద్యను దురోదరాదులు మరగి పతితుఁ
డాయె సినాఁడు కూలివాఁ; డాయ మొంత
వచ్చినను దారపుత్రుల కిచ్చు పైస
లస్తుబి స్తగు గంజికైన నకట!

మదిరాపానమునన్ నరుఁ
గదియనికీ డొడ్డికలదు! కావ్యునిదయచేఁ
బ్రబిలినతగులము మరలన్
బెదపెద్దలదనుక వచ్చి పేర్చెడి నకటా!

క్రాగువాఁడు మున్ను తప్పుచేసితి నని
పెద్దవారిఁ జూడ బిడియపడియె
నేఁడు మద్యపాయి నిగ్గీకుఁడై నిల్చి
నడిబజారునందు నాట్యమాడు.

మదిర క్రాగిక్రాగి మనుజుండు దనుజుఁడై
పరితపించు రక్తపానమునకు
దిక్కులేనివారు దేశాలుపట్టి రీ
మోహమునకు దాహమునకు వెఱచి.

తగదు తగదు మద్యంబని తాటిగెలల
నఱకె నపుడు సత్యాగ్రహానాయకుండు
తగును దగు నని ప్రజ కల్లుక్రాగు నిప్పు
డేశ మెంతలో నెంతదుస్థితికి వచ్చె !

పరుల నిష్కారణమ్ముగాఁ బరిభవింపఁ
గడఁగువానికి విధి బుద్ధిగఱపితీఱు
పాండవుల వనాశితులను బఱుపఁ బూని
కురువిభుం డెంత చెడఁ డిసీ ! ఘూపయాత్ర ?

తన్నుమించినబల్లిదుఁ గన్నయంత
నరునహాంత యడంగు, వానరముతోఁక
లేశమైనను గదలింపలేక శిబము
వంచెఁగద భీమునంతటివాఁడు మున్ను.

బాలుఁ డభిమన్యుమీఁదికి వేలకొలఁది
బంట్లు నంపినకురురాజు పాప ! మేగు
రొక్కతూకుగ ననుఁ దాఁకు టొప్ప దనియె
ముప్పుమూఁడినతఱిఁ బాడి సెప్పు నరుఁడు.

వెలఁది కెగ్గుసేత కొలఁది కందనికీడు
గూర్చుఁ బాండవులకుఁ గురువిభుండు
చెట్ట లెన్నినూగ్లు చేసినఁ బాంచాలి
పసువు చెఱుపఁడేని బ్రబుకువాఁడె.

దానమునకు విత్తమానముచే విల్వ
రాదు ధర్మతత్పరతను గాక
యింతజొన్నపిండి నిడినపేవకు సరి
గాకపోయె రాజు కనకమిడియు.

ఘోరదుఃఖమునకుఁ గారణంబగు ధర్మ
దూర మైనతృష్ణ యేరికేని
నీతిమాలి రాజమాత కాఁగోరిన
కైకబ్రదు కదెంత గణ్యమాయె.

వలచివచ్చినరాజ్యంబు వల దటంచుఁ
ద్రోసివైచెను, రామపాదుకలమ్రోల
దాసుఁడుగ నిల్చె భరతుఁ; డీత్యాగమునకు
ముజ్జగమ్మునురోమాంచమున మునుంగు.

అందె లిని జానకమ్మవే యనెద నదినె
పదములకు ప్రమొక్కనియతి నాపాలి దగుట
నన్నయా! కమ్మ లెవరివో! యనుసుమిత్ర
కొడుకు మనసంస్కృతికి వన్నెలిడు పతాక.

రామదర్శ నాగ తామోదమునఁ జొక్క
వాచ్చె శబరి వేయివత్సరములు
వేయి కాదు వేయివేలేండ్లయిన వార్చు
నుచిత యోగనిష్ఠ నుండుప్రాణి.

కలుషితములైన విషయవాంఛలను వీడి
ప్రజలఁ బసువులఁ గావించుప్రజ్ఞ కాదు
రాగనైరాదులను ద్రోసి రాముదెసకు
నడపు కౌశలమే కళ నాఁ జెలంగు.

మచ్చరమ్ముల మంటల రెచ్చఁగొట్టి
నరుని దయ్యముఁగా మార్చువెరవు కాదు
ప్రేమ నెసఁగించి కృపను అంపిల్లఁ జేసి
త్యాగిఁగాఁ దీర్చు నెఱివాదితనమె కైత.

కవుల కేమి నేఁడు గ్రామాన కొక నూఱు
మంది కలరు గాని మాటదారి
బ్రతుకుదారి వేఱుపడకుండ నిల్చువా
రెంతమంది యుందు రీ శతాన!

అంతంతలతోడన్ గవి
యుంతున కెక్కఁడు మనస్వి మైత్రిని మోహా
భ్రాంతుల కెడయై మునియై
యంతర్ముఖుఁ డైనగాఁడె యతఁడు రహించున్.

కాసు లున్నవానిఁ గన్నెత్తి చూడక
పదవి నున్నవానిపంచ నిలక
గంజిగోడఁ దనియు కవుల కేలోకంబు
మోఁకటించు వినయముగ్ధ మగుచు.

మురళియై విశ్వమోహనసరణి మ్రోయుఁ
దలఁచినప్పుడు వెదురు కోఁతలను గంట్లు
నోర్వవలయు సభాశ్లాఘ నొందఁగోరు
కవియు సైరింపవలయు నిక్కట్లు పెక్కుఁ.

కోరని యూహింపని స
త్కారము కైవార మందుకవి ఫలవాంఛా
దూరమగు కర్మయోగము
నేర్చి సైరించినట్టి నెఱిజోదు సుఁడీ!

ధరణీపతిచట్టమునకు
నరుఁగు కనుక్ బెగడువడుచు నమ్రత చూపుక్
పకపకవి శాసనమున్నకు
గరఁగి బలా! యనుచు మస్తకమ్మ్మును వంచున్.

రసమయ ప్రౌఢ భారతరచన వినిచి
చక్రవర్తిని గదలించి సన్నవడిన
మనుమవిభుపేర్మి నిలిపెఁ గొమ్మనసుతుంఁ
కథయిది వెలార్చు నుత్తమకవితబల్మి.

వెంటనే తినవలసిన వేఁడిరొట్టె
వంటిదా ప్రజ్ఞకలవాఁడు వ్రాయుకవిత !
దీనిరుచి దీనివేఁడిమి దివియు భువియు
నిలుచునందాఁక సడలక పిలుచుఁ బ్రజల.

గణయతిప్రాసవిధులు కారణము గాఁగఁ
గవి తలఁపని పెక్కుచక్కనలు వచ్చి
పద్య మలరించు సాహితీప్రౌఢమతుల
ధారణను నిల్చు హృద్య ముదాత్త మగుట.

వ్రాయవచ్చుఁ గైత వ్రాసినప్రతిపద్య
మిచ్చువేయరాదు పిచ్చరేఁగి
చూచిచూచి సాధుసుందరకావ్య మా
విష్కరింపవలయు విజ్ఞు లలర.

తప్పు లెన్ని యున్నఁ దనరచనంబు న
గ్గించువాఁడు కవికి మంచివాఁడు
నిజము సెప్పువాఁడు నింద్యుఁ డీఁకన్ మన
కాస యెట్లు బాగుపడు నయాఁరె !

సవరింపఁ దగినమాటలు
కవిచెవి కలవోక వచ్చుఁ గావునఁ గవితన్
బలుకునపు డతఁడు పెద్దయు
మెలఁకువతో నుండవలెఁ జుమీ ! బుధుఁ డయ్యున్.

అలివేలుమంగమం గన
వెలలెద మీబహుళచవితి వేఁబోక ననన్
గల విందు నాల్గుతప్పులు
తెలియుఁ గృతశ్రేముఁడు బాసతెఱఁగున్ మఱుఁగున్.

మనుచరిత్రము నాకు నేర్పినది బావ
రామకవి సమయానికి రాకపోయె
సరళ కనుపించినది కలాశాల ననఁగ
సూరులొప్పనినుడులిందుఁజొచ్చె మూఁడు.

గురువునాధ్వర్యమున గోష్ఠి జరగుచుండెఁ
దలవనితలంపుగా వచ్చెఁ జెలిమికాఁడు
దళము నిల్చె సమర్థవంతముగ ననికి
నాఁగ నెరసులు మూఁ డిందు డాఁగి యుండె.

పాఠశాలకు నీకఁ బొండు బాలులార !
శిష్యులు ! గణింపు మీవై దుషీబలంబు
సభలు జరపెను సంస్కృతీసముతు లనిన
దోసములు నాల్గు బుధులకున్ దోఁచు నిచట.

గాంధి మనబౌనిసత్వంబు క్రక్కదల్చె
సోమవర్మ భవానిని స్తుతినిజేసె
రాజు దండింపవలయు నేరస్థు ననిన
దిద్దదగుతావు లున్నవి దీన మూఁడు.

వాఁడు కవితాకళన్ యశోవంతుఁ డాయె
వంటవానితో గారెలు వండ మంటి
నితని యాధిక్యతను సైఁపఁ డతఁ డనంగ
నడుగడుగునందు నొకతప్పు విడిసె నిందు.

ఎవనియధ్యక్షతన సాగు నీసదస్సు !
చొరెను బసిపాప తప్పొమ్మొగ్గరమునందు
వీని తేజోన్నతికి రిపుల్ విచ్చి రనినఁ
బదపదమ్మున నొకతప్పు ఘదుము కొనియె.

ఏనుమతాక్ష్యదోషములెల్ల నెఱుఁగ
నితఁడుఁడున్ దనతప్పులనెల్లఁ గానఁ
డగుట ననోన్య కృతిసమీ క్షానుర క్త
చిత్తులై కవు లుద్దీప్తి చెందవలయు.

మంచినడతకతన మగువ, చుక్కలజేని
కతన రేయి, బుధులకతన గోష్ఠి,
యంచడంటకతన నబ్జాకరము, నియ
తోక్తికతనఁ గృతియు నొందు నొఱపు.

ఒక్కొక్క మహాకవి కృతి
నొక్కయెడన్ గట్టుదప్పియును డిందఁడు, లా
ధృక్కులతప్పులు వేయిటి
నొక్కతిం గూర్చుకవియు నుత్తముఁ డగునా !

కవి నిరంకుశుఁ డనుటచేఁ గట్టుదప్పి
విజ్ఞులీఁగు నటించు భావింపరాదు
లాఁతు లేమందురో యన్నభీతి లేక
ధర్మ్మపును జాటువాఁ డని తలఁపవలయు.

కవన మొకరసావేశ; మీతవులు సాగి
రేఁగినప్పుడు కవి పవల్ రేయి మఱచు,
మఱచు నన్నము, నిద్దుర మఱచుఁ, దుదకు
మఱచుఁ దన్ను నపూర్వసమాధి మఁగ్గి.

నరత దుర్ల్లభంబు, నరతలో విద్య డె
ప్పరము, పద్య యున్న నరిది కైత,
కైత నంద ముంట కడిఁది; కోటి కొకండు
పుడయు నిటఁ దపమ్ము పండి గెలుపు.

మానసీయుఁ డొక్కమాటతో మెచ్చినఁ
జాలు, విలువలేని తాలుగింజ
లెన్నితప్పకైత లిడి కొని యాడిన
వరున కెంతపరువుబరువు వచ్చు !

ఎంద ఱెంతని త్త మిచ్చిన యతమతి
గానికవికిఁ దిండికఅవు తప్ప;
దన్ని కాన్క లందుకొన్న శ్రీనాథుండు
కడకుఁ బడపాటు నుడువనేల?

నేర్మిలేనివారు నేఁటిపాఠకు లని
దారిదప్పి కవులు జాఅరాదు
త్రాడు చాల దన్నతలఁపుతో బావిని
బూడ్చువారు లగ్గ పొందలేరు.

చదువులేనివారిమది కందవలె నన్న
యూహాతోడ మేర లుత్తరించి
వ్రాయుచుందు మనెడివారికైత నిరక్ష
రాస్య మైనజనత కర్థమగునె?

బాసలోఁతు లంతుపట్టిన ప్రాజ్ఞుఁడే
పాత్రభేద మెఱిఁగి పల్కఁగలఁడు
కఠిన మృదుల వాఙ్మి కాయమెల్లను వాని
యిచ్ఛ ననుసరించి యెడఁదఁ గదలు.

ఏది యెట్టులున్న నీనాఁటి యువలలోఁ
గడలుకొనఁ దొడంగెఁ గైతవలపు
చాలుఁజాలు బుధులసంతుష్టి కీమేల్మి
చక్కఁబడరె వీరు చదివి చదివి.

నేఁటి కవిభావనాలలోఁ
బూఁటకుఁబూఁటకును మార్పు పుట్టుచునుండన్
నాఁటికవితలఁపులన్ దెగ
నాట విమర్శకున కుచితమా యివ్వేళన్ !

భోయవాఁడు సృజించె రామాయణంబు
పల్లెబిడ్డ రచించెను భారతంబు
మాల పెనిచెను దమిళవాఙ్మయమహత్త
నేల కులచర్చ కైసరు నెన్నుపట్లు.

అప్పకవి కెవరు తగు నని
చెప్పికొ కులవాద మొండు చేర్చెను గృతి; నీ
యప్పనుడిఁబట్టి బాఁపని
చప్పనికృతియున్ బుధప్రశంసలు కనునా ?

కాకునూరిసూరివాకునకున్ బోక
కదుక దేమి నేస్త; మంతమంది
కవుల-ధరణిసురులు కానివారల పల్కు-
లెట్లు రుజువులయ్యె నితని కదిర !

దురభిమానంపురొంపిలోఁ దోఁగినట్టి
మనుజునకు లేదగున్ మతి; మతి నశించి
నపుడు కులములఁ దెచ్చి హాస్యాస్పదంబు
లనవలంబము లగుతీర్పు లాడు నతఁడు

తనసేర్చిన నేర్పులచేఁ
దనయొార్చిన తపముచే నుదాత్తపదంబున్
గనుఁ గాని కులముచే నగుఁ
డొనయుఁడు పెద్దతిక మెన్ని యెత్తులఁ బడినన్.

కృతిపతిత్వము మంచిదే, పతియశస్సు
బ్రతుకు నాలుగుకాలాలపాటు దీన
నెడఁదచక్కన మేనిసొం పిరవుకొన్న
కృతియపో ! తగు నిచట నాదృతియొనర్ప.

ఎందఱుచళుక్య లీనేల నేల, రందు
నన్నపార్య మహాకావ్య నాథుఁ డగుట
రాజరా జొకఁడేకదా బ్రదికె నజర
మమరమైన యశమ్ము త న్నలముకొనఁగ.

మునుమసిద్ధి యెంతమహి నేలెఁ నల కవి
బ్రహ్మకనికరమ్ము పడసెఁ గానఁ
జక్రవర్తి పొందఁజాలనికీర్తి కా
చంద్రభాస్కరముగ నింద్రుఁ డయ్యె.

ఎంతపెనఁగిన ధీశక్తి యెంతయున్న
నెవఁడు కవి యౌను గురు నాశ్రయింపకున్న
గురుఁ డవిద్యాతమఃప్రభాకరుఁడు సేవ్య
తరుఁడు సాహ్లోద్ధాత మాధవుఁడు శివుఁడు.

ఆఁకటి నణఁచుచు నెఱుఁగమి
చీఁకటిఁ దొలఁగించుగురుని జేరనిపుణ్యాం
బీకొనునె నేల నాలన్
రూకల నరులకు నిమునరున్ జేరుటకున్.

నేర్చినకళ భగవత్కృపఁ
గూర్చినకళ నర్థి నొరులకున్ బంచినవాఁ
డర్చనలు పడయు, నిహాపర
వర్చస్సులు పడయు జగము వలగొనిమ్రొక్కన్.

ఎవరు తిరుపతివేంకటకవులతోడఁ
దొడరి గురుభక్తిలో సరితూఁగఁగలరు
చర్ల బ్రహ్మాయశోస్త్రియశం బశేష
జగమునకుఁ బ్రాఁకె నీశిష్యయుగముకతన.

చెళ్ళపిళ్ళ మహాకవియుల్ల మలరు
బాటలో గురుభక్తిని జాటినట్టి
సరసుఁ గాటూరి వేంకటేశ్వరుఁ దలంచి
మేలు మే లని కవికోటి మేను మఱచు.

గొప్పవాని నెదురుకొని యోడినను గొంత
యశము దక్కు ననుదురాశ పొడమి
యొప్పు తప్పు గననిమొప్పె మహాకవి
కృతిసమీక్ష కొగ్గి గేలివడయు.

వ్యాసునకు లేదు పాండిత్య,
భాసున కౌచిత్య మెఱుకపడనట్టిది, సో
మాసి తెలుఁ గొప్ప దను స
న్నాసులు సాహిత్యశీలనమున కనర్హుల్.

పంచే దనయెత్తుబంగారు పాత్రములకు
వాసిరెడ్డి మహీశుఁ; డీవార్త కెరిసి
పుచ్చువంకాయలను బంచే బొలఁతి యొకతి
కలరు నేఁ డికెతమ్ములు కవికులాన.

వారు వీసు నొకని వంకరటింకర
కైత దిద్దిదిద్ది కనుణచాటి;
రవల మొదటిపద్యమైన నా కృతికర్త
సరిగఁ జదువలేక సభల ముడిఁగె.

పిఱుఁదులతో మైచేవను
బిరుదులతో ధీబలమ్మునఁ బెద్దలు గుర్తిం
పరు నమ్మ; రిది యెఱుంగక
తిరియుం బట్టముల కలఁతి దేవుఁడు వడుచునే.

సభలు సమకూర్చి పొగడికల్ చాటి తన్ను
గౌరవింపమి కొకజజ్జు దూఱు నొగుల
నొకవికారి నిజాస్యమం దొఱపు మెఱపు
వెలువరింపమి కద్దమున్ విసరికొట్టు.

ఎంతచదివినఁ బట్టంబు లెన్నియున్న
మనుజుఁడు వినమ్రుఁడై యౌనమాలురాని
వృద్ధుకడ నేర్వఁదగువిద్య పెద్ద యుండుఁ
బ్రజ్ఞ యన్నది యొకనిసంపత్తి గాదు.

తల్లి భాసపట్ల నెల్లర కనురక్తి
కలదు గాని తొట్టతొలుత నిచటఁ
జెప్పవలయుఁ దమిళుఁ జిట్టచివర కాంధ్రు
నుగ్గడింపవలయుఁ సిగ్గుపడక.

మూఁడేండ్లకుట్రఁ డే. బీ.
సీ.డీ.లను దిద్దుఁ డెల్లుసీమ నయాశే !
వీఁడు తననేలనే పెఱ
వాఁడగుటన్ జాతి కెంత వల్లడి యగునో !

చనదు లాఁతిపల్కు మనబిడ్డకుఁ బదేండ్ల
యీడు వచ్చుదనుక నించుకేని
పిదప నన్యభాష బిఱబిఱ నగ్గమౌ
మాతృవాణిమీఁది మమత హెచ్చు.

సురభాష సర్వభాషల
నెఱివణిగలభాస యనుట నిక్కము; మైనన్
బెఱిబాసలెల్ల దీనన్
దొరలినవే యనుట సత్యదూరంబుకదా !

ఎల్ల తెల్లనుడికిఁ దల్లి సంస్కృత మని
చూపఁ బెనఁగువారిఁ జూచి వగతు
'రెండు' 'ద్వంద్వ' పదమునుండి పుట్టెనె ? మోహా
మెంతయున్నఁ దెగువ యింతచన్నె ?

ఎన్నఁదగులింగములు మన కెన్ని వేలు
లేవు ? తతోఁకటిలో మూఁడులింగములన
లెక్కకుం దెచ్చి యొకఁడు 'త్రిలింగ'శబ్ద
సృష్టి గావించెఁ దాంత్రికపుష్టికొఱకు.

తెనుఁగునుండి తెలుఁగు, తెలుఁగునుండి త్రిలింగ
ముద్భవించె ననుట యొ ప్పటంచు
నుగ్గడించినట్టి ప్రెగ్గడ లక్ష్మణ
రావు నేత్రు సత్యరతులు కృతులు.

నటకెడి కుఠారమునకున్
బరిమళ మిడుచందనమ్ము, బంధించెడి కా
పరికిన్ బా లిడు సురభియు
గుఱుతునకున్ వచ్చు నేసు కురిసిన దొరికిన్.

కొట్టినవాసిం గొట్టక
పట్టుము తచ్చరణయుగము, పండినప్రేమన్
బెట్టుము దానికిమ్ము; ద్దని
నట్టిఫరీ దేసుతమ్మోఁ డని పలుఁకఁదగున్.

మతముపేర సాటిమానవులతల ద్రుంచి
మతముపేర మాతృమహిని జీల్చి
శాంతి నెవఁడు పఁడయు ? సమతాదనీయమూ
మతము నిలువఁగలదె మనసమెతి .

తెనుఁగు నధికారభాషఁగాఁ దెచ్చుతలఁపు
తగినదే కాని "శ్రీరామనగర" సంజ్ఞి
మన విధానసభా ఖండమునకున్నైన
నిర్ణయింపుఁము మంత్రితానియతులార !

ఆంధ్రసవనాగ్నికి హవిష్యమైన ధీరుఁ
దెనుఁగునేలకు వాసిదెచ్చిన యుదాసు
మఁఅవకుఁడు పొట్టి వీరు నమాత్యులార!
పెట్టుఁ డీమేటిపే రొక్క-పేఁటకేని.

పేఁటకా వీటికా కాదు పెద్దసీమ
కే ప్రకాశమునామంబు గీలుకొల్పి
త్యాగిదెసఁ గృతజ్ఞత చాటినట్టి నాఁటి
తెలుఁగుసచివుల యౌచిత్య మలఘుతరము

రమ్మనినవారు వెండియు రమ్మటంచుఁ
బిలుచుకైవడి వర్తింపనలయు నరుఁడు
పిలువకున్నను గేస్తుల బెరసి వారి
కధికమాపంపుఁదద్దిన మగుట రోఁత.

అతనిఁ జూచి నీచుఁ డకృత్యునం బడుఁ
బెనఁగులాడు నతనిపేరు డింప
నింత కతఁడు దోస మెయ్యది కావించె ?
బొంకుసెప్పఁ డధముఁ బొగడలేఁడు.

కమ్మ్రవాయ నుత్త రమ్మ్ర పంపఁ డొకండు
మగుడ వ్రాయ జడత మానుఁ గాని
మొదటిలేఖ నాకు ముట్టలే దను, నొండె
నూర లేమి జంపు మూరె ననును.

క్రుళ్లి పుగులురలు కుణపంబు లెన్నివే
లైన మోయఁగలదు గాని ధరణి
లేశమేని నిజములేనట్టి నడపిన్గు
నొక్కదానినైన నోర్వలేదు.

జీవిత మొక మంజులకళ
కావలయును శాంతిసౌఖ్యఖని కావలయున్
కోవల కులముల మతముల
కావులతగు లూడ్చువాఁడ దానిన్ బడయున్.

పాపపుణ్యములను బొంటింపనొల్లని
రాజనీతితో సమాజ కష్ట
సుఖసమీక్ష కిచ్చసూపని మతముతో
నరుఁడు దారి దప్పినాడు నేఁడు.

పొగరు హెచ్చిహెచ్చి పూజ్యుల కవమతి
గూర్చువాఁడు చెట్ట కుడిచితీఱు
నహుషుఁ డేమియయ్యె మహానీయులకుఁ దన
పల్లకీ వహింపఁ బనుపుపెట్టి.

మేరదాఁటి వచ్చువైరితోడఁ బెనంగు
కంటెమున్ను ప్రజల గాసిపెట్టు
లేమితోడ నెఱుకలేమితోడఁ బెనంగి
పడయవలయు గెలుపు ప్రభుతవారు.

తెనుఁగువానిబ్రదుకు తేలిపోయిన దని
తెల్ల సేయునా సుధీర్ కిశోర్ ము
ఖాఖ్య? లక్కటా ! యజంతము తెనుఁ గన్న
మాట మఱివఁదగునె మనజనమ్ము ?

వలపువల దనుతెరువరివంతుపైస
లిచ్చె నొకగుండు బస్సులో నిరువదైదు
నసుగుచు నితండు కదిసె మర్నాఁడువాని
సైదురూపాయ లప్పిత్తురా యటంచు.

బస్సు గీపెట్టినను నడిబాటనుండి
కదలఁడే వాఁడు వదలెనా బ్రదుకుఁ దీపి
యీప్రజారాజ్యమందు న న్నెవఁడు త్రోయు
నని మొరాయించెనా త్రాగెనా సెబాసు !

నకునిశేముషి పండిననాఁడు పుట్టి
నుపనిషత్తులు సత్యప్రియోక్తిఖనులు
వెట్టితలవైచినంతన వెడలినవి పు
రాణములు వర వైరకారణము లగుచు.
ణ్ణె

కృతయుగ మిఁక రాదు మను
స్మృతి రాజ్యముసేయ దేటి కెదురీఁదునరుల్
పతితులు పరిహాస్యు లను
చ్ఛితు లౌదురు జగము వికృతిశీలమ్ము చుఁడీ !

సంతుకతన రాదు సంపత్తి చే రాదు
రాదు యజ్ఞకర్మరక్తిఁ జేసి
కాన నుంట రాదు కావింతోడను రాదు
వలపు లుడిగినపుడె వచ్చు ముక్తి.

గుడ్డరంగు మార్చుకొన్నంత నేమాయె
మనసురంగు మార్చుకొనుట వలయు
మార్చుకొనఁగ నోడుమస్కరి యొకతుకన్
గట్టుకొనుట మేలు జుట్టుపెంచి.

చందా లని గ్రంథా లని
ముందిర మని సత్ర మనియు మఠ మని సిరికిన్
బందాలగు సన్నాసులు
పొందుదురా ముక్తిసుఖము పొందించెదరా !

సచరాచరమగు జగమున
కచలంబగు తేజ మొకటి యాదరు వని న
మ్మి చరింతు రిచటివారలు
శుచితాసౌందర్యజనిత సుషమా మహితుల్.

అది సత్యం బది జ్ఞానం
బది పుట్టువు చావు లేని దది యానందం
బది శాంతము శివ మద్వయ
మదె బ్రహ్మం బది యుపాస్య మమృతార్థులకున్.

ఏ నింద్రియసందోహము
గాను మనసు గాను నే నఖండాత్మను నా
ఖానిస యామానస మని
ధ్యానస్థితిలో నరుండు తలపోయవలెన్.

దేహాభిమాన మను పెను
మోహము గలవాఁడు బ్రహ్మమును సగుణముఁగా
నూహించి కొలుచు, బోధ
వ్యాహతమోహుండు నిర్గుణాధ్వము వలచున్.

నామదికిన్ బల మొసఁగుము
నీమార్గమునందు నడుచునే ర్పొసఁగుము న
న్నేమిఱకుము నీ లెంకను
స్వామీ ! యని నరుఁడు ప్రభు నుపాసింపవలెన్.

పాపుల నను నిందించిన
కాపురుషుల నామనమ్ము కలఁచిన జడులన్
సైఁపఁగల తాల్మి నిమ్మని
యాపోవక వేఁడవలయు నభవు నుపాస్తిన్.

వెల్లువవలె భక్తిరసం
బుల్లమునోఁ బొంగి పొరలకుండిన నేలా
పల్లవిపాటలు గజ్జెలు
ఘల్లురనన్ బుడమి వడఁక గంతులువేఁతల్.

తలబిరుసు వీడి యే నొక
యలంతిరవవంటివాఁడ నని నరుఁ డాత్మన్
దలపోసినపుడె కరుణా
కలితమతిన్ వేలు పతనికడగం డ్లడఁచున్.

కామాది భయదశత్రు
స్తోమము నరుపెంపు డింపఁ జూచును సతమున్
ధీమంతుఁ డీశ్వరుని హృత్
సీమను గాపుంచి దానిచేవ నణంచున్.

కొండనుండి జాటి ఘోరాటవులఁ దూతి
వెడలి పరుగువెట్టి బడలిబడలి
సురువుగ్రగక్కి యేఱు శరనిధిలోఁజొచ్చు
పగిది నీశుఁ జేరఁదగును ప్రాణి.

ఎంతవిద్యయున్న నేల్బడియున్న నం
దాలకీవియైన తపణియున్న
నాత్మదర్శనమ్ము నందనివానికి
దక్కు-సౌఖ్య మెంత ? తనివి యెంత ?

తప్పి రేఁగినపుడు చప్పునఁ జను జీవి
తేటనీటి నొసఁగు నేటిదరికి
నాత్మదర్శనేచ్ఛ యడరినతఱిఁ బరు
వెత్త నరుఁడు తత్త్వవేత్తకడకు.

పూఁట కొక్కగురుని బూజింపఁ దొడఁగిన
వెట్టి కబ్బునా వివేకదీప్తి
చెదు నతండు దొండుపడనలపైఁ గాళ్లు
మోపి నదిని బోవ మూర్ఖునట్లు.

స్త్రీశూద్రులకును శ్రుత్యుప
దేశము తగు నని జగమ్ము దిద్దిన సమతా
కోశ మసంగానంద య
తీశుఁడు తోలుబంతి యెజ్జ యిక్కాలమునన్.

ప్రాఁబలుకుకంచె నుపనిషద్భాషకంచె
గీతనుడికంచె సాబర్మతీతపస్వి
మాట జవదాఁటరాని ప్రమాణ మెతని
కతని కొనింపు మలయాళయతికి నతులు.

నేఁడు గాంధి పుట్టినాఁడుకదా !యిది
పర్వాదిన మటన్న భవ్యభావ
మెంతమందియెఱఁద నేర్పడెఁ గృష్ణజ
యంతికంఁటె నీజయంతి యసదె ?

గాంధితో నడంగెఁ గర్తవ్యనిష్ఠ మ
హాత్ముతో వివేక మస్తమించె
భారతోర్వి నిపుణు పదవులకాట్లాట
తెఱఁ గేమికలదు నిక్క మరయ ?

త్యాగమును మఱచి రన్నలు
భోగమ్ములకై రణాల బ్రుంగిరి తగ దీ
యాగం; బిది సాగినచో
రాఁగలమే లెద్ది యిహాపరచ్యుతి దక్కన్.

మిత్తికి జంకక పదవుల
గత్తరలోఁ బడక బ్రదుకు కడచనుదనుకన్
జిత్తము దేహాము సేవా
యత్తము గావించి గాంధి యమరత నందెన్.

చిన్నచిన్న తెగింపులచేత రాదు
రాజ్య మాత్మార్పణముతోన రాక పోసఁగుఁ
గదలుఁ డన్న ! లటంచు నల్గక వడంక
ఁడదు నడిపినగాంధి కెవ్వండు సాటి ?

గుట్టుమీఱఁడు తనదోసము
బట్టబయల్ సేయ సిగ్గుపడఁ డొరుతప్పున్
నెట్టన తనతల నిడుకొని
నిట్టులు సాగించె గాంధి నిశ్చింతమునన్.

తరతరాల మబ్బు తెరలు విచ్చేదించి
వన్నెదెచ్చె గాంధి వనిత కిచట
నతనికేలు సోఁకినంతన రమణీయ
మణిశలాక యయ్యె మట్టిగడ్డ.

అతనిముందు కల్ల యనదయై దురపిల్లఁ
దలడిలి పిఱికితనము పఱిచె
ముచ్చెముడిఁగెఁ బొగరు చచ్చెఁ గామాదులు
గాంధి దుర్నితతిమిర ఖరకరుండు.

విశ్వమెల్లఁ దనకు వినతమై కైమోడ్పు
నవనికెల్ల లెంకయయ్యె గాంధి
యతఁడు తనమబట్ట నుఱుకుట యబ్రమా
పరపురీష మెత్తు పని వఱింప.

బాపుగాఁ గర్మయోగంబు రూపుదాల్చి
భక్తి విడరానిచుట్టమై పరఁగె దాని
కేఱుక చెలియయ్యె నయోగ్యి నరసి మనుట
ధరణిఁగల సర్వపుణ్యతీర్థములఁ గనుట.

చేసిచెప్పెఁ గాని చేయక యొరుల కే
మంచిపనియు గాంధి మప్పలేదు
మలమునెత్తెఁ గలిమివలదనెఁ జెఱకేగ
నుపవసించె జాతి కుసుఱులిచ్చె.

వేసట గానక జాతి
శ్రీ సంపాదనము కొఱకుఁ జిరతరతపమున్
జేసినగాంధిని మఱచిన
దోసం బీదేశమునకు దూరంబగుతన్ !

కల్ల కపట మెఱుంగనికన్నె యగుట
బాల యొక్కఁతె మందారమాల వైచి
వినత యయ్యె బాపూశిలావిగ్రహమున
కాయురారోగ్యములు దీని కబ్బెఁ గాక !

ఎక్కట్లు నరుని దిద్దెడు
చక్కట్లు తెనుంగులెంక శారదజడలోఁ
జిక్కినవిరు లివి కమ్మన
మిక్కిల నాచంద్రకమలమిత్రం బలరున్ !

సాధుపత్రము

పొరట	బంతి		
11	18	అడుగునాడఁడగు	అడుగువాఁడగు
11	19	విష్ణునంతటిఁవాడొరు	విష్ణునంతటివాఁడొరు
13	3	గామలు	గుములు
13	13	నాకున్న	నాకన్ను
28	2	రిపుఁడు	రిపుఁమక
28	3	కపడఁ	న్పడఁ
33	5	కుట్లుఁ	కుట్లు
44	15	బఱుపఁఁ	బఱుపఁ
57	8	వలయుఁ	వలయు
60	17	బొంటింప	బాటింప
60	20	దారిదప్పినాడు	దారిదప్పినాఁడు

వా కృ తు లు (పద్యము)

1. ఆత్మార్పణము	
2. ధర్మజ్యోతి	
3. రాష్ట్రగానము-	3-50
4. ఉదయగానము	
(ఒక సంపుటముగా)	
5. సర్వోదయగానము	
6. పక్షిగపంట - ఖండకావ్యములు	
7. శబల ,,	
8. పైరపంట ,,	1-80
9. సమదర్శి ,,	2-00
10. గీతాదర్శము	
11. తెనుఁగునీతి (భర్తృహరి)	
12. నేను	
13. ఆత్మకథ (బాపూజీ)	
14. మహాత్మకథ (ఆత్మకథ తపువాయి)	
15. నాకథలు	8-00
16. ఎక్కటిల్లు	2-50

3, 4, 8, 9, 15, 16 నిల్వాలో నున్నవి.

— తుమ్మల సీతారామమూర్తి
అప్పికట్ల, గుంటూరుజిల్లా.
522 310

సర్వోదయ ప్రింటర్స్,
కొత్తపేట
తెనాలి.

73

GLRROIA193

కవిత చెప్పినాఁడఁ గనకాభిషేకాది
పరమగౌరవములు పడసినాఁడ
నేల కులుకవలయు నీసిరిఁ జూచి నే
నెవఁడనో రవంత యెఱుఁగనైతి.

	మనసు ఫౌండేషన్
	పుస్తకాల పరిశీలనాపట్టిక

పుస్తకం సంఖ్య	GLRB01A198
పుస్తకం పేరు	[illegible]
తారీఖు	14-08-24
ముందు అట్ట	yes
వెనుక అట్ట	yes
మొత్తం పేజీలు	89
పెద్ద సైజు పేజీలు	No
ఖాళీ పేజీలు	i, 73, IV, X
లేని పేజీలు	No
తయారు చేసినది	Triveni
పేజీలు విడదీసినది	Triveni
స్కాన్ చేసినది	Malathi.
పరీక్ష చేసినది	KASIMBI
పేజీలు సరిచూసినది	
బైండింగు చేసినది	
ప్యాకింగు చేసినది	
స్కాన్ చెయ్యనివి	
తప్పులు	NO
పరిస్థితి	Good.